సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 22 । మే । 2024



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి ఆకాష్ భట్నాగర్, అంజికా దంపతులు (రాజమహేంద్రవరం) మంగళవారం రూ.1,01,116 విరాళం అందజేశారు.



వస్తున్నాయ్ సత్యదేవుని రథచక్రాల్

దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రూ.1.04 కోట్లతో రూపొందించిన నూతన రథంపై అన్నవరం సత్యదేవునికి బుధవారం కన్నుల పండువగా రథోత్సవం నిర్వహించనున్నారు. – 8లో

గరిష్టం/కనిష్టం 40.0°/27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	38.0	27.0
కాకినాడ	37.0	27.7
అమలాపురం	40.0	27.0

న్యూస్‌రీల్

రాజ్యలక్ష్మి అమ్మవారికి వెండి చీర సమర్పణ



వెండిచీరను ఆలయ ఈవో వెంకటేశ్వరరావుకు అందజేస్తున్న దాతలు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు కేశవపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవీ, భూదేవి సమేత శ్రీ కేశవస్వామివారి దేవస్థానానికి ఒక దాత వెండి చీరను సమర్పించారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా రాజ్యలక్ష్మి అమ్మవారికి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ సూర్యనారాయణమూర్తి తన తల్లిదండ్రులు భాస్కరమ్మ, రామంల జ్ఞాపకార్థం సుమారు రూ.3 లక్షల విలువచేసే మూడు కిలోల వెండిచీరను ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి శ్రావణ కుమారాచార్యులు వెండి చీరకు సంప్రోక్షణ నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో కొల్లు శ్రీను, బిళ్లకుర్తి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

21న లక్ష్మీనృసింహునికి మహా జ్యేష్టాభిషేకం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వచ్చే నెల 21వ తేదీన స్వామివారి మూలవిరాట్టుకు సప్తనది తీర్థ మహా జ్యేష్టాభిషేకం నిర్వహిస్తున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఆరోజు జ్యేష్టా నక్షత్ర పర్వదినాన గంగా, యమున, గోదావరి, సరస్వతి, నర్మదా, సింధు, కావేరి జలాలతో అర్చకులు, వేదపండితులు స్వామివారి మూలవిరాట్టుకు అభిషేకం చేస్తారన్నారు. ఇందులో పాల్గొన దలచిన భక్తులు టికెట్ రుసుము రూ.400 చెల్లించాలని ఆయన తెలిపారు. కాగా వచ్చే నెల 3వ తేదీన ఆలయంలో బహుళ ద్వాదశి పర్వదినాన స్వామికి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

విద్యాహక్కు చట్టంలో 1,040 మందికి అడ్మిషన్లు

రాయవరం: విద్యాహక్కు చట్టంలో భాగంగా జిల్లాలో ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 1,040 మంది చిన్నారులకు ఒకటో తరగతిలో అడ్మిషన్స్ చేపట్టారు. విద్యా హక్కు చట్టం కింద ఒకటో తరగతిలో 25శాతం ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 3,076 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2,576 మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఏ పాఠశాలలో అడ్మిషన్ కోరుకుంటున్నారో కూడా ఎంపిక చేసుకున్నారు. పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు మొదటి విడతగా లాటరీ నిర్వహించి, 1,439 మందికి ఒకటో తరగతిలో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. ఎంపికైన జాబితాలను సంబంధిత ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు పంపించారు. అడ్మిషన్ల ప్రవేశానికి ఈ నెల 20 చివరి తేదీ కాగా 72.27 శాతం మంది అడ్మిషన్స్ పొందారు. 399 మంది తల్లిదండ్రులు వివిధ కారణాలతో తమ చిన్నారులను వారికి నిర్దేశించిన పాఠశాలల్లో చేర్చలేదు.

తొలవరికి సిద్ధం

- జిల్లాలో సార్వా సాగుకు ప్రణాళిక
- 1,68,780 ఎకరాల్లో వరి సాగుకు సమాయత్తం
- 33,750 క్వింటాళ్ల విత్తనాలు అవసరం
- ఏపీ సీడ్స్‌కు 3,500 క్వింటాళ్ల విత్తనాల కోసం ఇండెంట్
- ఆర్‌బీకేల్లో 900 క్వింటాళ్లు రెడీ
- 42,493 మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం లక్ష్యం
- ప్రైవేట్ డీలర్లు, మార్క్‌ఫెడ్ వద్ద 37,950 మెట్రిక్ టన్నులు
- ప్రతీ ఆర్‌బీకేకు 20 టన్నుల సరఫరాకు చర్యలు



ఖరీఫ్ దమ్ము చేస్తున్న రైతు (ఫైల్)

కొత్తపేట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. అన్నదాతల కష్టం తెలిసిన రాష్ట్ర ప్రభుత్వం వారికి ఇబ్బంది లేకుండా వ్యవసాయ ప్రోత్సాహక పథకాలు అమలు చేసి తోడ్పాటునందిస్తోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లేలా వ్యవసాయ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. పంట దిగుబడిలో కీలకమైన నాణ్యత గల విత్తనాలు, ఎరువులు అందించేందుకు చర్యలు చేపట్టింది. ముందుగానే రైతులకు విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించేలా చర్యలు తీసుకుంది. రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడం వల్ల ముందుగా నారుమడులు పోసుకోవడానికి, వెదజల్లు పద్ధతిలో సాగు చేయడానికి వీలవుతుంది. ఆ మేరకు గత ఏడాది మాదిరిగానే ఖరీఫ్ (తొలకరి) సీజన్‌కు సంబంధించి ప్రధాన పంట కాలువలకు గోదావరి నీరు విడుదల చేయనుంది. ఖరీఫ్ ప్రణాళికకు సంబంధించి వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు తెలిపారు.



కొత్తపేటలో ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వీఏఏ కార్తిక్

జిల్లాలో ఖరీఫ్ ప్రణాళిక ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి చీఫ్ ప్లానింగ్ విభాగం, జిల్లా వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 1,68,780 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. ఎంటీయూ 7029 రకం సుమారు 73 శాతం వినియోగిస్తుండగా మిగిలిన 27 శాతం ఎంటీయూ 1318, ఎంటీయూ 1064 తదితర రకాలు వినియోగిస్తున్నారు. ఆ మేరకు 33,750 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా ఇప్పటికి సుమారు 23 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతుల వద్ద, 7,250 క్వింటాళ్లు ప్రైవేట్ డీలర్ల వద్ద, 900 క్వింటాళ్ల విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. 3,500 క్వింటాళ్ల విత్తనాలకు ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ పెట్టారు.

ఈ ఖరీఫ్‌కు 43,493 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా దిగుమతి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ప్రైవేట్ డీలర్ల వద్ద, మార్క్‌ఫెడ్ వద్ద 37,950 మెట్రిక్ టన్నులు ఎరువులు ఉన్నాయి. ఆ మొత్తంలో యూరియా 13,250 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2,900 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 2,100 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 10,600 మెట్రిక్ టన్నులు, సూపర్ 1,020 మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నాయి. గ్రామాల్లో రైతులకు సరఫరా చేసేందుకు ప్రతి ఆర్‌బీకేకు 20 మెట్రిక్ టన్నుల ఎరువులు దిగుమతి చేయడానికి వ్యవసాయ శాఖ కమిషనరేట్ చర్యలు తీసుకుంటోంది.

రైతు మోములో చిరునవ్వులు పూయించిన ప్రభుత్వం

గత ఏడాది కౌలు రైతులకు సంబంధించి 63,900 సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేశారు. వాటి ఆధారంగా 24,082 మంది రైతులకు రూ.78.78 కోట్లు వివిధ రూపాల్లో రుణాలుగా ఇచ్చారు. వ్యవసాయం దండగ అన్న టీడీపీ పాలకుల అభిప్రాయానికి పూర్తి భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరించింది. సాగు ప్రోత్సాహక, రైతు సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటి దిశగా నడిపించింది. వ్యవసాయాన్ని పండగ చేసి చూపించింది. కొన్ని సీజన్లలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టాలు చవి చూసినా ఏ సీజన్‌కు ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా అమలు చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంది. ఈ విధంగా గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు మోములో చిరునవ్వులు పూయించింది.

ఖరీఫ్ సాగుకు ప్రణాళిక సిద్ధం



ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ రైతులకు అన్ని విధాలా సాయపడేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గతేడాది మాదిరిగానే విత్తనాలు, ఎరువులు అందించనున్నాం. ఆ మేరకు ప్రణాళికాబద్ధంగా అన్నీ సిద్ధం చేశాం. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. ఆర్‌బీకేల్లో విత్తనాలతో పాటు దశల వారీగా అవసరమైన ఎరువుల సరఫరా చేయనున్నాం. నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపాన్లు, భారీ వర్షాల బారినపడి పంట నష్టాలు సంభవించకుండా ముందుగానే సార్వా సాగు చేపట్టేలా రైతులు సిద్ధం కావాలి. ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు, గ్రామాల్లో వ్యవసాయ సహాయకుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలు, అవసరం మేరకు ఎరువులు వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలి.

– వి.బోసుబాబు, జిల్లా వ్యవసాయ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

పనుల ప్రగతిపై సంతృప్తి

వంతెన నిర్మాణాన్ని పరిశీలించిన ఏఐఐబీ బృందం



వశిష్ట నదీపాయపై వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఐఐబీ ప్రతినిధుల బృందం

పి.గన్నవరం: వశిష్ట నదిపై ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక గ్రామాల ప్రజల కోసం రూ.49.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన పనులను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ప్రతినిధుల బృందం మంగళవారం పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని లంక గ్రామాల ప్రజలు కలుసుకుని, తాము పడుతున్న ఇబ్బందులను వివరించి, వంతెన నిర్మించాలని కోరిన విషయం విదితమే. దీంతో జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో వశిష్ట నదిపై వంతెన పనులు ప్రారంభమై, వేగంగా జరుగుతున్నాయి. దీంతో ఈ పనులను ఏఐఐబీ ప్రతినిధులు పరాద్ అహ్మద్ (బంగ్లాదేశ్), అశోక్‌కుమార్ (ఇండియా), యోగేష్ మల్లా (నేపాల్), లారా (ఫిలిప్పీన్స్), కౌశిక్ రెహమాన్ (బంగ్లాదేశ్)లు పీఆర్ సీఈ సీవీ సుబ్బారెడ్డి, ఎస్ఈ బి.రవీంద్ర, ఈఈ రమణమూర్తి తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకూ జరిగిన పనుల ప్రగతిని పీఆర్ డీఈఈ అన్యం రాంబాబు వారికి వివరించారు. సుమారు రూ.9 కోట్ల మేర పనులు జరిగాయని ఆయన తెలిపారు. ఈ ప్యాకేజీలో భాగంగా ప్రధాన పంట కాలువపై వంతెన నిర్మాణ పనులు 75 శాతం పూర్తి అయ్యాయి. నదిపై వంతెన పనుల్లో భాగంగా ఏటిగట్టు వద్ద మూడు కల్వర్టు బాక్సులు, ఐదు పిల్లర్లను నిర్మించారు. వీటిలో మూడు పిల్లర్లు పూర్తి కాగా, మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి. అబెట్ పిల్లర్ నుంచి 210 మీటర్ల అప్రోచ్ రోడ్డు పూర్తయిందని డీఈఈ వివరించారు. పనుల ప్రగతి పట్ల కాంట్రాక్టు సంస్థను ఏఐఐబీ బృందం అభినందించింది. సైట్‌లో ఒక మహిళ రోలర్‌తో రోడ్డు చదును చేయడాన్ని చూసిన బృందం ఆమెను అభినందించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని బృంద సభ్యులు సూచించారు. పీఆర్ ఈఈ కె.చంటిబాబు, ప్రాజెక్ట్ అడ్వయిజర్ ప్రభాకర్‌రెడ్డి, నరసింహారావు, ఏఈఈ సత్యనారాయణ, కొండలరావు పాల్గొన్నారు.

సకాలంలో సాగు నీరు

అధికారులకు కలెక్టర్ శుక్లా ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

సాక్షి అమలాపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాలువలు, డ్రైనేజీలలో పూడికతీత పనులను చేపట్టి రైతులకు సకాలంలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా డ్వామా జలవనరుల అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విద్యుత్ సరఫరా, పోలింగ్ అనంతరం భద్రత, నరేగా పనుల నిర్వహణ, వేసవిలో తాగు నీటి సరఫరాపై జిల్లాల వారీగా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవి దృష్ట్యా కాలువలో నీటి సరఫరా నిలిపివేసినందున నరేగా ద్వారా ఫీల్డ్ ఛానల్స్‌లో పేరుకుపోయిన పూడికతీత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మొక్కల పెంపకం తదితర గ్రామాభివృద్ధి పథకాలను ఎక్కువగా చేపట్టాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ద్వారా తాగునీరు ప్రజలకు సరఫరా చేయాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్ లూజ్ అమ్మకాలు నిర్వహించకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల పరిధిలో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. మందు గుండు సామగ్రిని అమ్మకాలు నిషేధించామన్నారు. జూన్ నాలుగో తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంలో ప్రజలు, మీడియా ప్రతినిధులు పూర్తి సంయమనం పాటించాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సీపీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్ బాబు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్లు టి.వైద్యనాథ్ శర్మ, పి. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అడ్మిషన్లకు 'గురి'దేవుల కృషి

- నేరుగా విద్యార్థుల ఇళ్లకే ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలపై ప్రధానోపాధ్యాయుల ఫోకస్
- వేసవి సెలవుల్లోనూ విధుల పట్ల అంకితభావం
- స్ఫూర్తిగా నిలుస్తున్న పలువురు హెచ్‌ఎంలు, టీచర్లు
- వచ్చే నెల 12న పాఠశాలల పునఃప్రారంభం



మండపేట మండలం వెలగతోడులో ఇంటి వద్దే విద్యార్థి తల్లికి అడ్మిషన్ పత్రం అందిస్తున్న టీచర్లు



10 ఫలితాల ప్రతిభను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రాయవరం: వేసవి సెలవుల్లోనూ పని చేయాలా అంటూ పెదవి విరుస్తున్న వారికి జిల్లాలోని పలువురు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. మనబడి మన బాధ్యతను గుర్తు చేసుకుంటూ 2024–25 విద్యా సంవత్సరం అడ్మిషన్లపై ఇప్పటి నుంచే ఫోకస్ పెట్టారు. ఉన్నత పాఠశాలల సమీప గ్రామాలకు వెళ్లి మన బడిలోనే మీ పిల్లలను చేర్పించండి..అంటూ తల్లిదండ్రులను కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక సౌకర్యాలు, అందిస్తున్న విద్యాప్రమాణాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో సాధించిన ఉత్తీర్ణతను..విద్యార్థులు సాధించిన మార్కులను..కరపత్రాల రూపంలో ముద్రించి గ్రామాల్లోని ఇంటింటికి తిరిగి పంచుతున్నారు. జిల్లాలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ బడుల పరిరక్షణ కోసం అంకిత భావంతో పనిచేస్తున్నారు.

ప్రైవేటుకు దీటుగా..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరం అడ్మిషన్లపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేలా మండల విద్యాశాఖాధికారులకు, ప్రధానోపాధ్యాయులకు వెబెక్స్, గూగుల్ మీట్ సమావేశాల ద్వారా మార్గదర్శకత్వం చేశారు. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అడ్మిషన్ల ప్రక్రియను బాధ్యతగా తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు వల వేస్తూ ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించాయి. దీనికి అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు.

వారిపైనే ఫోకస్..

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న ప్రీ స్కూల్స్‌లో 3–6 సంవత్సరాల వయసు ఉన్న వారు 40వేల మంది ఉన్నారు. వీరిలో ఐదేళ్ల పైబడిన వారు దాదాపుగా 12వేల మంది వరకు ఉన్నారు. ఐదు సంవత్సరాల వయసు పైబడిన పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ఫోకస్ పెట్టారు. ప్రైవేట్ కాన్వెంట్స్‌లో యూకేజీ చదువుతున్న విద్యార్థులు కూడా దాదాపుగా ఆరువేల మంది వరకు ఉన్నారు. గత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 18,302 అడ్మిషన్లు జరిగాయి. ఈ ఏడాది కూడా ఇంచుమించుగా అదే సంఖ్యలో అడ్మిషన్లు జరిగే అవకాశముంది. ఐదవ తరగతి నుంచి 22,757 మంది విద్యార్థులు ఆరవ తరగతిలోకి ప్రమోట్ అవుతున్నారు. 7వ తరగతి నుంచి 8వ తరగతిలోకి 21,552 మంది ప్రమోట్ అవుతుండగా, 219 ప్రాథమిక పాఠశాలల్లో రెండవ తరగతి చదువుతున్న 1,511 మంది ఉపాధ్యాయులు మూడవ తరగతిలో చేరనున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇప్పటికే ఐదో తరగతి చదువుతున్న వారితో పాటుగా, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను కూడా చేర్చుకునేందుకు వారి తల్లిదండ్రులను మోటివేట్ చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చేవారు ఎవరైనా ఉంటే వారికి ముందస్తుగా అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తల సహకారం తీసుకుంటూ అడ్మిషన్లు పెంచుతున్నారు.

కరపత్రాలు, ఫ్లెక్సీలతో ప్రచారం

పలు ప్రభుత్వ పాఠశాలలు వినూత్నంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఇటీవల పదవ తరగతి ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలను ప్రచారాస్త్రాలుగా వినియోగించుకుంటున్నారు. 'పది' ఫలితాల్లో మెరిట్ విద్యార్థుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఆయా పాఠశాలల వద్ద ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నారు. ఎన్‌ఎంఎంఎస్, చెకుముకి వంటి టాలెంట్ టెస్టులు, జవహర్ నవోదయ, ట్రిపుల్ ఐటీల్లో విద్యార్థులు సాధించిన సీట్ల వివరాలను ఫ్లెక్సీల్లో పొందుపర్చారు. పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలనే విద్యార్థుల అడ్మిషన్లకు ప్రచారాస్త్రాలుగా వాడుకుంటున్నారు. కొందరు ప్రధానోపాధ్యాయులు ఫ్లెక్సీలను ఆటోలకు కట్టి, మైకు ద్వారా ప్రచారం చేయించారు. పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు ఏ మాత్రం తీసిపోవు అంటూ సగర్వంగా ప్రచారం చేసిన వైనం ఎక్కడికక్కడ కన్పించింది.

నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోంది. పాఠశాల నుంచి గతంలో ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. గత విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చి మా పాఠశాలల్లో అడ్మిషన్స్ పొందారు. ఈ విద్యా సంవత్సరంలో 11 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులు సాధించిన విజయాలను తల్లిదండ్రులకు వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్నాం.

– కె.వెంకటలక్ష్మి, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, మురమళ్ల, ఐ.పోలవరం మండలం

తల్లిదండ్రుల స్పందన బాగుంది



ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే పొందే ప్రయోజనాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. వేసవి సెలవులను ఆలోచించకుండా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. ఉపాధ్యాయులు కూడా బాధ్యతగా విద్యార్థులను చేర్పించేందుకు స్వచ్ఛందంగా వచ్చారు. తల్లిదండ్రుల నుంచి స్పందన కూడా బాగుంది.

– జి.కనకదుర్గ, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, ముంగండ, పి.గన్నవరం మండలం

సంతోషించదగ్గ విషయం



ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంచేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవడం సంతోషించదగ్గ విషయం. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు అంగన్‌వాడీల నుంచి బయటకు వచ్చే విద్యార్థులను చేర్చుకుంటున్నారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలను వదిలిపెట్టే విద్యార్థులను ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చేర్చుకుంటున్నారు. విద్యార్థుల చేరికతోనే పాఠశాలలు బలోపేతం అవుతాయి అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

బందోబస్తుపై ముందస్తు కసరత్తు

- ఓట్ల లెక్కింపు రోజు అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు
- జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాల్లో క్యాసో తనిఖీలు
- పోలీసు ఆంక్షలపై ప్రజలకు అవగాహన సదస్సులు



రాయవరంలో అవగాహన సదస్సు నిర్వహించిన పోలీసు అధికారులు

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జిల్లా పోలీసు శాఖ ముందస్తు కసరత్తుతో పటిష్టమైన బందోబస్తుకు చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ సునరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆదేశాలతో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తమ తమ ప్రాంతాల్లో ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలసి మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (క్యాసో) పేరుతో తనిఖీలు నిర్వహించి పలు అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకున్నారు. రికార్డులు లేని బైక్‌లు, డీజల్ ఆయిల్, నాటు సారాను సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన క్యాసో తనిఖీలు, పట్టుబడ్డ వస్తువుల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం మంగళవారం రాత్రి ఓ ప్రకటనలో వివరించింది.

– అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు పర్యవేక్షణలో కాట్రేనికోన పోలీసు స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామం పోర గ్రామంలో క్యాసో తనిఖీలు నిర్వహించారు. సరైన రికార్డులు లేని 8 బైక్‌లను, ఒక ఆటోను సీజ్ చేశారు.

- అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద క్యాసో తనిఖీలు నిర్వహించారు. డాక్యుమెంట్స్ లేని 16 బైక్‌లను, ఒక ఆటోను ఎస్సై జి. హరీష్‌కుమార్ సీజ్ చేశారు.
- ఐ.పోలవరం మండలంలో సమస్యాత్మక గ్రామం భైరవపాలెంలో అనుమానస్పద వ్యక్తులను, చట్ట విరుద్ధమైన వస్తువులను తనిఖీలు చేశారు. డాక్యుమెంట్స్ లేని 21 మోటారు సైకిళ్లను, ఒక ఆటోను, 1450 లీటర్ల డీజిల్ ఆయిల్‌ను పోలీసు అధికారులు సీజ్ చేశారు.
- రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో మండపేట పట్టణం గొల్లపుంత కాలనీలో తనిఖీలు నిర్వహించారు. మండపేట సీఐ అఖిల్ జమ, ఎస్సై శ్రీహరికోటి శాస్త్రి ఈ తనిఖీలు చేపట్టి రికార్డులు సరిగా లేని 18 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు.
- రామచంద్రపురం సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తూరి అపార్ట్‌మెంట్ వద్ద క్యాసో తనిఖీలు నిర్వహించారు. డాక్యుమెంట్లు సరిగా లేని 15 మోటారు సైకిళ్లను ఎస్సై కె.సురేష్‌బాబు సీజ్ చేశారు.
- రాయవరం పోలీసు స్టేషన్ పరిధిలోని మాచవరం, పసలపూడి, చెల్లూరు గ్రామాలు, మండపేట మండలం ద్వారపూడి గ్రామాల్లో పోలీసు అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి ఓట్ల లెక్కింపు రోజున పోలీసు ఆంక్షలపై అవగాహన కల్పించారు.
- మండపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని కేశవరం గ్రామంలో తనిఖీలు చేసి ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతని నుంచి 200 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఓ కారును సీజ్ చేశారు.
- మలికిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో క్యాసో తనిఖీలు నిర్వహించారు. డాక్యుమెంట్లు సరిగా లేని 50 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు.
- రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ర్యాలీ గ్రామంలో క్యాసో తనిఖీలు నిర్వహించి 6 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు.
- జిల్లాలో ప్రతీ పోలీసు సర్కిల్, పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం క్యాసో తనిఖీలు నిర్వహించడంతోపాటు ఓట్ల లెక్కింపు రోజున ఎంతటి సంయమనంతో ఉండాలో ప్రజలకు పోలీసు అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎవరూ రెచ్చగొట్టే మాటలు, ప్రకటనలు చేయవద్దని హితవు పలికారు. బాణసంచా కాల్పులు, పెట్రోలు లూజ్ అమ్మకాలపై విధించిన నిషేధాజ్ఞలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న గౌరవ అధ్యక్షుడు చల్లా తదితరులు

ఆలమూరు: మండలంలోని కలవచర్లకు చెందిన మదర్ థెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఇటీవల విశాఖపట్నం రైల్వే గ్రౌండ్ ఆవరణలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చారు. 38 కేజీల విభాగంలో బుంగ అశ్విన్(గోల్డ్), 35 కేజీల విభాగంలో ఖండవిల్లి మహిమాకర్ (సిల్వర్), 40 కేజీల విభాగంలో గెద్దాడ జ్యాయ్ కిరణ్ (సిల్వర్), బాలికల 30 కేజీల విభాగంలో కట్టా అనుశ్రీ కార్తికేయ (గోల్డ్), టిక్వాండో పోటీల్లో వడ్డి గిరిజ (గోల్డ్), వడ్డి కార్తికేయ (సిల్వర్) సాధించినట్టు గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు తెలిపారు. అవార్డులు సాధించిన విద్యార్థులను మాస్టర్స్ సంఘ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ చల్లా ప్రభాకరరావు, సీనియర్ మాస్టర్స్ లంకె వెంకట రెడ్డి, నార్గాని సెంథిల్ కుమార్, టి.లక్ష్మి, టి.కిరణ్, బుంగ అర్జున్ అభినందించారు.

టీ పొడి దుకాణాలపై విజిలెన్స్ దాడులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): టౌన్ హాలు రోడ్డులో ఉన్న తేజ అస్సాం టీ పొడి, కీర్తి అస్సాం టీ పొడి దుకాణాలపె విజిలెన్స్ దాడి చేయగా అక్కడ నిషేధించిన సింథటిక్ ఫుడ్ కలర్ టార్ట్రాజైన్, సన్ సెట్ పసుపులను టీ పొడిలో కలపడం గుర్తించారు. వెంటనే ఆ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ల్యాబ్‌కు పంపారు. ఈ దుకాణాలపై అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

వస్తున్నాయ్ సత్యదేవుని రథచక్రాల్

- నేడు భారీ టేకు రథంపై ఊరేగనున్న స్వామి, అమ్మవార్లు
- ఆలయ చరిత్రలో తొలిసారిగా 36 అడుగుల ఎత్తు రథం వినియోగం
- సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి వరకు..

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో ఐదో రోజు బుధవారం మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఆలయ చరిత్రలో తొలిసారిగా 36 అడుగుల ఎత్తు కలిగిన నూతన టేకు రథంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించనున్నారు. ఈ ఊరేగింపు కొండ దిగువన మెయిన్‌రోడ్డులో సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు సాగనుంది. స్వామి, అమ్మవార్ల రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ మహోత్సవాలలో సత్యదేవుని ఊరేగింపు రాత్రి తొమ్మిది గంటలకు ప్రారంభమవడం ఎప్పటి నుంచో ఆనవాయితీ. అయితే భద్రతా ఏర్పాట్లతో బాటు, ముందు జాగ్రత్తగా బుధవారం జరిగే రథోత్సవాన్ని సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభిస్తున్నారు. రాత్రి తొమ్మిది గంటల వరకు ఈ రథోత్సవం కొనసాగనుంది. ఈ రథోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు.

రథోత్సవం ఇలా..

ఉదయం తొమ్మిది గంటలకు రథాన్ని పంపా సత్రం నుంచి తొలిపాంచా వద్దకు తీసుకువస్తారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి రథాన్ని పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని రథంపై ఉంచి పూజలు చేస్తారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ కొబ్బరికాయలు కొట్టి రథం ముందు పోసిన కుంభం మీదుగా రథాన్ని లాగుతారు. రథోత్సవంలో భాగంగా సుమారు 200 మంది వివిధ కళారూపాలను ప్రదర్శిస్తారని అధికారులు తెలిపారు. రథోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం నుంచి మెయిన్‌రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

పెద్ద రథంలేని లోటు తీరిందిలా...

135 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం వార్షిక ఆదాయం రూ.157 కోట్లు. అయినప్పటికీ సుమారు 50 సంవత్సరాల క్రితం తయారు చేయించిన ఊరేగింపు వాహనాలు మినహా భారీ రథం లేదు. వెండి రేకు తాపడం చేసిన చిన్న రథం ఉన్నా దాని ఎత్తు పది అడుగులకు మించదు. ఆ రథం కూడా శిథిలావస్థకు చేరడంతో కొత్తగా స్వామివారి ఊరేగింపునకు రథం చేయించాలన్న ఆలోచన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ గత ఏడాది కార్యరూపం దాల్చింది. దేవస్థానం ఈఓగా 2022–23 సంవత్సరంలో సేవలందించిన ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ స్వామివారిని రత్నగిరి ఆలయ ప్రాంగణంలో ఊరేగించేందుకు సుమారు 16 అడుగుల ఎత్తు కలిగిన చిన్నరథం, కల్యాణ మహోత్సవంలో కొండ దిగువన స్వామి, అమ్మవార్లను ఊరేగించేందుకు 36 అడుగుల ఎత్తు కలిగిన పెద్ద రథన్ని రూ.1.42 కోట్ల వ్యయంతో తయారు చేసేందుకు టెండర్లు ఖరారు చేశారు. వీటిని మురమండకు చెందిన మాణిక్యాంబ శిల్పకలా ఉడ్ వర్క్స్ అధినేతలు కొల్లాటి కామేశ్వరరావు, శ్రీనివాస్, మరో 20 మంది శిల్పులు తయారు చేశారు. రథసప్తమి నాడు చిన్న రథాన్ని ప్రారంభించారు. దీనిపై ప్రతి ఆదివారం స్వామి,అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగిస్తున్నారు.

కల్యాణ మహోత్సవాలలో స్వామి, అమ్మవార్లను ఊరేగించేందుకురూ.1.04 కోట్లతో 36 అడుగుల ఎత్తు, 14.6 అడుగుల వెడల్పు, 21 అడుగుల పొడవుతో చేయించిన టేకు రథాన్ని గత నెల 26వ తేదీన లాంఛనంగా ప్రారంభించారు. గత గురువారం మెయిన్ రోడ్డులో ఈ రథానికి ట్రయిల్ రన్ నిర్వహించారు. అయితే రథాన్ని ఎత్తే మోటార్ కెపాసిటీ తక్కువ ఉండడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది.


సత్యదేవుని రథానికి తుది మెరుగులు దిద్దుతున్న అధికారులు

రథం ఎత్తేందుకు జాకీకి 2హెచ్‌పీ మోటార్ ఏర్పాటు

రథం జాకీకి ఎక్కువ లోడు ఎత్తే మోటార్ బిగించాలని ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. దాంతో మంగళవారం ఆ మోటార్ స్థానంలో 2హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈఈ మురళి, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ, చౌదరి తదితరుల సమక్షంలో ఆ మోటార్‌ను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ మోటార్‌కు జనరేటర్ కూడా అమర్చుతున్నారు.

కమిటీలు ఏర్పాటు చేశాం



తొలిపావంచా వద్ద నుంచి ఆంధ్రాబ్యాంక్ సెంటర్‌కు అక్కడ నుంచి దేవస్థానం హైస్కూల్ వద్ద గల టోల్‌గేట్ వరకు మళ్లీ అక్కడ నుంచి తొలిపావంచా వరకు రథోత్సవం జరుగుతుంది. రథోత్సవం నిర్వహణకు దేవస్థానం సిబ్బందితో పలు కమిటీలు ఏర్పాటు చేశాం. బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను కోరాం. భక్తులు, గ్రామస్తులు సహకరించాలి.

– కె.రామచంద్రమోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మునిపల్లి కోటిగట్టు ప్రాంతానికి చెందిన నాగారాపు లలిత (29) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మరణించింది. ఎస్ఐ కె.మనోహర జోషి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన నాగారపు భీమేంద్ర.. గొల్లవిల్లి పంచాయతీ పరిధి ఇందిరానగర్‌కు చెందిన లలితను ఐదు సంవత్సరాల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు. అయితే భార్యాభర్తల మధ్య తరచు గొడవలు జరిగేవి. భర్త వేధింపులు తాళ లేక సోమవారం సాయంత్రం లలిత ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని మరణించినట్టు భీమేంద్ర కుటుంబీకులు పోలీసులకు, లలిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి తహసీల్దార్ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో శవ పరీక్షలు నిర్వహించారు. తన అల్లుడు భీమేంద్ర తన కూతురు లలితను హతమార్చి ఉరి వేసుకున్నట్టు చిత్రీకరించాడని మృతురాలి తల్లి పరమట పుష్పలత ఆరోపిస్తున్నారు. మృతురాలి సోదరుడు పరమట ప్రసాద్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు. కొత్తపేట డీఎస్పీ కె.వి.రమణ, అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు సమక్షంలో కేసు విచారణ జరుపుతున్నామని, భీమేంద్రను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ జోషి తెలిపారు.

లెక్చరర్ సుబ్బారావుకు డాక్టరేట్, భారత్ కళారత్న అవార్డు

- బహుముఖ ప్రజ్ఞాశాలిగా అమెరికా జీహెచ్‌పీయూ గుర్తింపు
- ఈ నెల 25న చెన్నై భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో ప్రదానం


వులుసు వీవీఎస్ సుబ్బారావు


రామచంద్రశ్రీహరి (రామం)

కొత్తపేట: స్థానిక ఒక ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు, కవి, రచయిత వులుసు వీరవెంకట సత్య సుబ్బారావు అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) గౌరవ డాక్టరేట్, భారత్ కళారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఆ మేరకు జీహెచ్‌పీయూ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పీ మాన్యూల్ ధ్రువీకరణ పత్రాలు పంపినట్టు సుబ్బారావు మంగళవారం కొత్తపేటలో విలేకరులకు తెలిపారు. రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన వులుసు సుబ్బారావు సత్యహరిశ్చంద్ర, బాలనాగమ్మ తదితర పౌరాణిక నాటకాలు, అన్నా – చెల్లెలు, పూలకంగడు, కనకపు సింహాసనమున హుష్‌కాకి, అన్నదాత తదితర సాంఘిక నాటకాల్లో ప్రధాన పాత్రలు పోషించిన కళాకారుడు. 2008లో కొత్తపేట వచ్చి స్థిరపడి ఒక ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా తన వృత్తిని కొనసాగిస్తూ, ప్రవృత్తిగా కవి, రచయితగా తన ప్రతిభను చాటుకుంటున్నారు. సుబ్బారావు బహుముఖ ప్రజ్ఞను గుర్తించిన జీహెచ్‌పీయూ గౌరవ డాక్టరేట్‌తో పాటు భారత్ కళారత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 25 న చెన్నై భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా సుబ్బారావుకు డాక్టరేట్‌ను, అవార్డును ప్రదానం చేయనున్నారు.

పురోహితుడు రామంకు సేవారత్న అవార్డు

స్థానిక పురోహితుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం) జీహెచ్‌పీయూ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఆ మేరకు జీహెచ్‌పీయూ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పీ మాన్యూల్ ధ్రువీకరణ పత్రాలు పంపినట్టు రామం విలేకరులకు తెలిపారు. ఆయన పలు ఆలయాల్లో అర్చకునిగా, గ్రామ పురోహితునిగా పనిచేస్తూ దేశ, విదేశాల కరెన్సీ నోట్లు, నాణేలు, డాలర్స్, రకరకాల వస్తువులు, 124 సంవత్సరాల పంచాంగాలు సేకరించారు. వివిధ సంస్థల అవార్డులు, రికార్డులు సాధించారు. ఈ నెల 25 న చెన్నైలో అవార్డును స్వీకరించనున్నారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడి మృతి

- ఐదుకు చేరిన రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య
- అన్నదమ్ముల మృతితో ఏవీపాలెంలో విషాద ఛాయలు


చిలకలపూడి సురేష్ (ఫైల్)

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడి గ్రామం వద్ద ఇటీవల ధాన్యం లోడు ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిలకలపూడి సురేష్ (35) మంగళవారం మృతి చెందాడు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది. ఈ నెల 14వ తేదీ సాయంత్రం పి.గన్నవరం మండలం ఊడిమూడి వద్ద రోడ్డు పక్కన 10 మంది వ్యవసాయ కార్మికులు ట్రాక్టర్‌లో ధాన్యం బస్తాలు లోడ్ చేసి, పగ్గాలు కడుతుండగా రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టిన విషయం విదితమే. ప్రమాదంలో జి.పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యనారాయణ, ఈరి కట్లయ్య, అదిమూలంవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో మణిబాబు అన్న చిలకలపూడి సురేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతడిని అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో అతడిని గత శుక్రవారం రాత్రి కాకినాడలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సురేష్ మృతదేహానికి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ కేసు నమోదు చేయగా, సీఐ ప్రశాంతకుమార్ దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబంలో అన్నదమ్ములు మృతి చెందడంతో ఆదిమూలం వారిపాలెంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సురేష్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు భోరున విలపించారు. మృతుని తండ్రి చిలకలపూడి వెంకటేశ్వరరావు, తల్లి సత్యనారాయణయమ్మ, అన్న గోపాలకృష్ణ, వారి కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

ఉప్పుటేరులో దూకి వివాహిత మృతి


వివాహిత మృతదేహం

కొత్తపల్లి: వివాహేతర సంబంధం కారణంగా ఒక వివాహిత ఉప్పుటేరులో దూకి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అమరవల్లి గ్రామానికి చెందిన బోరా కనకదుర్గ(38)అదే గ్రామానికి చెందిన బోరా చిన రమణారెడ్డి కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనకదుర్గను కొంతకాలంగా చిన రమణారెడ్డి వేధింపులకు గురి చేస్తున్నాడు. వేధింపులు తట్టుకోలేక ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త బోరా రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రత్నగిరిపై వేదఘోష


స్వామి, అమ్మవార్ల సమక్షంలో సాగిన పండిత సదస్యం

150 మంది పండితులకు సత్కారం

అన్నవరం : రత్నగిరి సత్యదేవుని సన్నిధి మంగళవారం వేదఘోషతో ప్రతిధ్వనించింది. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా వైశాఖ శుద్ధ త్రయోదశి, మంగళ వారం సాయంత్రం నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్ల సమక్షంలో వేదపండిత సదస్యం జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వేద, స్మార్త పండితులు స్వామివారి ముందు తమ వేదవిద్వత్తును ప్రదర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది పండితులు వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను పెళ్లిపెద్దలు సీతారాములు వెంటరాగా అనివేటి మంటపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి అక్కడి వేదికపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఆలయ వేద పండితుడు ఉపాధ్యాయుల వేంకట సుబ్రహ్మణ్య ఘనపాఠి అధ్యక్షతన పండిత సదస్సు నిర్వహించారు. పండితులు స్వామివారి ముందు నాలుగు వేదాలు పఠించారు. తరువాత దేవస్థానం వేదపండితులు సత్యదేవుడు, అమ్మవార్లకు ఆశీస్సులందచేశారు.

పండిత సత్కారం

అనంతరం వేదపండితులను దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ సత్కరించారు. సత్కారం పొందిన వారిలో తిరుపతి వైదిక యూనివర్సిటీ వేదార్థ విభాగ అధిపతి ప్రవా రామకృష్ణ సోమయాజీ, రాజమహేంద్రవరానికి చెందిన మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి, విజయవాడ దేవస్థానం వేద పండితులు ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్య ఘనపాఠి, తంగిరాల వేంకటేశ్వర ఘనపాఠి, అన్నవరం దేవస్థానం విశ్రాంత వేద పండితులు ముష్టి కామశాస్త్రి తదితరులున్నారు.

అన్నవరంలో నేడు

- తెల్లవారుజామున 3.00: సుప్రభాత సేవ
- ఉదయం 8.00: చతుర్వేద పారాయణ
- సాయంత్రం 4.00: కొండ దిగువన దేవస్థానం ఉద్యానవనంలో స్వామివారి వనవిహారం
- సాయంత్రం 5.00: కొండ దిగువన నూతన టేకు రథంపై సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు
- ఉదయం 7.00 – 10.00, సాయంత్రం 5.00 – రాత్రి 11.00: రత్నగిరి కళావేదిక మీద, కొండ దిగువన సాంస్కృతిక కార్యక్రమాలు

శాంతికి ఉన్న శక్తి అనంతం

ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు


జ్యోతి వెలిగిస్తున్న ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు

బోట్‌క్లబ్: మన దేశంలో శాంతి అనే పదానికి ఎంతో శక్తి ఉందని ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక సూర్యకళామందిరంలో మంగళవారం రాత్రి ప్రముఖ సంగీత వాగ్గేయకారుడు కొచ్చర్లకోట రామరాజు కీర్తనల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతదేశంలో సంగీతానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. ఎందరో మహానుభావులు సంగీత కళ ద్వారా వర్షాలు కురిపించి తమ ఘనతను చాటుకున్నారన్నారు. మన హిందూ దేవుళ్ల చేతుల్లో సైతం ఏదో ఒక సంగీత పరికరాన్ని అలంకరించి ఉంటారని పేర్కొన్నారు. మానసిక ప్రశాంతత కోసం మాత్రమే సంగీతం కాదన్నారు. ఎంతో మంది సంగీత కళాకారులు తమ సంగీత సాధనాలతో భగవంతుని సైతం మెప్పించారన్నారు. సంగీత కళాకారుడు కొచ్చర్లకోట రామరాజు కీర్తనలను ఆవిష్కరించే భాగ్యం తనకు దక్కడం గొప్ప విషయమన్నారు. ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సభ్యులు వారణాసి రామ్‌మాధవ్ మాట్లాడుతూ రామరాజు వంటి మహానీయులు అప్పటిలోనే ఉచితంగా సంగీతం నేర్పడంతో పాటు నేర్చుకొనేవారికి ఉచితంగా వసతి కల్పించారన్నారు. కళలకు కుల మతాలు లేవన్నారు. కళలు డబ్బులు సంపాదించుకొనేందుకు కాదన్నారు. బ్రహ్మ వ్యవస్థలో కుల విభజన ఎక్కడా లేదన్నారు. 6వ శతాబ్దంలో కులాంతర వివాహాలు సైతం జరిగేవన్నారు. కొచ్చర్లకోట రామరాజు చారిటబుల్ ట్రస్ట్ న్యూఢిల్లీ ప్రతినిధి కొచ్చర్లకోట ప్రభాకర సుందరరావు మాట్లాడుతూ ఎప్పటి నుంచో కలగా మిగిలిన తన తాతగారి కీర్తనలు ఇన్ని రోజులకు సీడీ రూపంలో తయారు చేసి వినే భాగ్యం తమకు కలగడం గొప్ప విషయమన్నారు. అనంతరం రామరాజు రచించిన కీర్తనలను ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి ఆలపించారు. తొలుత ముఖ్య అతిథులు జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. నార్త్ ఈస్ట్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీవీఎస్ఎల్ఎన్ మూర్తి, సుందర స్వామి పాల్గొన్నారు.